సాక్షి
జోగుళాంబ గద్వాల
మంగళవారం । 17 । డిసెంబర్ । 2024



భక్తిశ్రద్ధలతో ఆరుద్రోత్సవం
అలంపూర్ జోగుళాంబ ఆలయంలో ఆరుద్రోత్సవం వైభవంగా జరిగింది.
వివరాలు 8లో ▸



నేరస్తులపై నిఘా..
నేరస్తులపై హిస్టరీ షీట్స్ తెరిచి వారిపై నిఘా ఉంచాలని ఐజీ సత్యనారాయణ అన్నారు.
వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /11.5
వాతావరణం
ఉదయం నుంచి చలి తీవ్రత అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

జడ్జిల ప్రత్యేక పూజలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గద్వాల న్యాయమూర్తులు గంటా కవితాదేవి, టీ. లక్ష్మి, పూజిత, ఉదయ్‌నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు న్యాయమూర్తులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అర్చకులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి న్యాయమూర్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శేషవస్త్రంతో సత్కరించి మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, చంద్రశేఖర్‌రావు, నాగరాజుశర్మ, దీరేంద్ర దాస్‌లు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అసెంబ్లీ ముట్టడి నేపథ్యం.. ముందస్తు అరెస్టులు

గట్టు: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యు) జిల్లా అధ్యక్షుడు హలీంపాషను సోమవారం తెల్లవారుజామున గట్టు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శీతాకాల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ముట్టడికి పీడీఎస్‌యూ నాయకులు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ముందుస్తు అరెస్టు చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, గంజాయి, డ్రగ్స్‌ను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ రంగ వైద్యంను మెరుగు పరచాలని, ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో దోపిడీని అరికట్టాలనే డిమాండ్లతో పీడీఎస్‌యూ నాయకులు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో హలీంపాషను పెంచికలపాడు గ్రామంలో, జిల్లాలోని ఇతర నాయకులను అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

మన్యంకొండలో ధనుర్మాస పూజలు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ధనుర్మాస పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి సంవత్సరం సంక్రాంతికి ముందు దేవస్థానంలో సంప్రదాయ రీతిలో పూజలను నెల రోజుల పాటు అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రతిరోజు తెల్లవారుజామున 4 గంటలకు ముందే స్వామివారికి ప్రత్యేక పూజలు, ఉదయం 5.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. ప్రతిరోజు ఒక శ్లోకం చొప్పున తిరుపావై (గోదాదేవి 30 శ్లోకాలు)లను నెలరోజులపాటు స్వామివారి సన్నిధిలో పురోహితులు చదువుతారు. సంక్రాంతి పండుగ వరకు ఈ పూజా కార్యక్రమాలు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, అర్చకులు పాల్గొన్నారు.

సందిగ్ధం...!

ఇంటిగ్రేటెడ్ జిల్లా కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి అవాంతరాలు



కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు (ఫైల్)

- రెండు వర్గాలుగా బార్ అసోసియేషన్ న్యాయవాదులు
- గతంలో కేటాయించిన స్థలంలో నిర్మించాలని ఓ వర్గం..
- పీజేపీ క్యాంపు పరిధిలోనే చేపట్టాలని మరోవర్గం పట్టు
- విధుల బహిష్కరణ.. వారం రోజులుగా నిరసన కార్యక్రమాలు

గద్వాల: గద్వాల బార్ అసోసియేషన్ న్యాయవాదులు రెండు వర్గాలుగా విడిపోవడం.. జిల్లా ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణాన్ని గతంలో చూపిన స్థలంలోనే చేపట్టాలని ఒక వర్గం.. లేదు పీజేపీ క్యాంపు పరిధిలో స్థలం కేటాయించి అక్కడే నిర్మాణం చేపట్టాలని మరో వర్గం పట్టుబట్టడం.. మొత్తంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో జిల్లా ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి అవాంతరాలు ఏర్పడ్డాయి. గత ప్రభుత్వ హయాంలో ఇంటిగ్రేటెడ్ జిల్లా కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి పుటాన్‌పల్లి వద్ద 15 ఎకరాల స్థలం, రూ.91కోట్లు నిధులు మంజూరీ అయ్యాయి. కాగా న్యాయవాదులలో భిన్నభిప్రాయాలు ఏర్పడడంతో న్యాయవాదులు విధులు బహిష్కరించి గత వారం రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా కలెక్టర్, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేశారు. దీంతో ఇంటిగ్రేటెడ్ జిల్లా కోర్టు కాంప్లెక్స్ నిర్మాణంపై సందిగ్ధత నెలకొంది.

జిల్లా ఏర్పాటుతో అదనపు కోర్టులు

ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తరువాత గత ప్రభుత్వ హయాంలో 2016లో నూతన జిల్లాలు ఏర్పడ్డాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలో భాగంగా ఉన్న గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలను కలిపి జోగులాంబ గద్వాల జిల్లాగా ఏర్పాటు చేశారు. జిల్లా ఏర్పాటుకు ముందు గద్వాలలో థర్డ్ అడిషనల్ జిల్లా కోర్టు, సబ్‌కోర్టు, మున్సిఫ్ కోర్టులుండేవి. జిల్లా ఏర్పడిన అనంతరం కొత్తగా ఆరు కోర్టులు వచ్చాయి. జిల్లా కోర్టు, అడిషనల్ సబ్‌కోర్టు, స్పెషల్ ఫాస్ట్రాక్ రేప్ అండ్ పోక్సో కోర్టు, అడిషనల్ మున్సిఫ్ కోర్టు, జువెనైల బోర్డు, జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ కోర్టులు వచ్చాయి. వీటితో పాటు జిల్లాకు ఇంకా మరిన్ని కోర్టులు రావాల్సి ఉంది. వీటిలో ఏసీబీ కోర్టు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు, కన్జ్యూమర్ కోర్టు, లేబర్ కోర్టు, ఫ్యామిలీ కోర్టు, ఆర్బిట్రేషన్ కోర్టు, మోటర్ వెహికిల్ యాక్సిడెంట్ కోర్టు, ఎక్సైజ్ కోర్టు, ఎలక్ట్రిసిటీ కోర్టు, సీడ్ యాక్ట్ కోర్టు వచ్చే అవకాశాలు ఉన్నాయి.



ఇదివరకే గద్వాల మండలం పుటాన్‌పల్లి వద్ద కోర్టు నిర్మాణం కోసం కేటాయించిన స్థలం మ్యాప్

విధుల బహిష్కరణ.. కక్షిదారుల ఇక్కట్లు

న్యాయవాదుల మధ్య నెలకొన్న భిన్నాభిప్రాయాల కారణంగా వివిధ కేసులలో కక్షిదారులకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెట్టాయి. గత వారం రోజులుగా విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమాలు చేపడుతుండడంతో పలు కేసులలో సాక్ష్యాలు, తీర్పులు, బెయిల్ వంటి వాటికి ఆటంకం ఏర్పడి వాయిదాలు పడుతున్నాయి.

త్వరగా పనులు చేపట్టాలి

గత ప్రభుత్వ హయాంలో ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి స్థలం కేటాయింపు, రూ.91కోట్లు నిధులు మంజూరీ అయ్యాయి. ప్రస్తుతం స్థల మార్పిడి కోరుతూ జరుగుతున్న జాప్యం కారణంగా నిర్మాణ పనులు ఆలస్యంతో పాటు, మంజూరీ అయిన నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉంది. నూతన స్థలం కేటాయించలేని పక్షంలో అధికారులు వెంటనే ఇదివరకే కేటాయించిన స్థలంలో నిర్మాణం పనులు చేపట్టి నిధులు వెనక్కి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలి.

– షఫీఉల్లా, బార్‌అసోసియేషన్ ప్రధానకార్యదర్శి, గద్వాల

అందరికీ అనుకూలంగా..

గతంలో పుటాన్‌పల్లి వద్ద కేటాయించిన స్థలం అనుకూలంగా లేకపోవడంతో కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల సమీపంలో పీజేపీ క్యాంపు ఆవరణలోనే జిల్లా ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్ నిర్మిస్తే కక్షిదారులు, న్యాయవాదులకు, అధికారులకు అనుకూలంగా ఉంటుందని బార్‌అసోసియేషన్‌లోని మెజారిటీ న్యాయవాదులు తీర్మానం చేశారు. మెజారిటీ న్యాయవాదుల అభిప్రాయం ప్రకారమే ముందుకు వెళ్తాం. దీనిపై కలెక్టర్ నిర్ణయం కోసం వేచి చూస్తున్నాం. మెజారిటీ సభ్యుల అభిప్రాయం ప్రకారమే నిర్మాణం జరగాలని ఆశిస్తున్నా.

– రఘురాంరెడ్డి, బార్‌అసోయోషన్ అధ్యక్షుడు గద్వాల

రూ.91కోట్లతో ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్

జిల్లా ఏర్పాటుతో తొమ్మిది కోర్టులుండగా మరికొన్ని కోర్టులు వచ్చే అవకాశం ఉండడంతో జిల్లాలో నూతనంగా ఇంటిగ్రేటెడ్ జిల్లా కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వ హయాంలోనే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు స్థలాలు కేటాయింపులు, నిధుల మంజూరీ జరిగాయి. ఇందులో భాగంగానే గద్వాలలో ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి స్థలం, నిధుల మంజూరీ చేశారు. ఈ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి గద్వాల మండలం పుటాన్‌పల్లి శివారులోని సర్వే నంబర్‌లో 368లో 15ఎకరాల స్థలం కేటాయింపు, రూ.91 కోట్లు నిధులు మంజూరీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.81కోట్లు మంజూరీ చేయగా, గద్వాల జిల్లాకు మాత్రం ల్యాండ్ డెవ్‌లప్‌మెంట్ కోసం రూ.10కోట్లు అదనంగా మంజూరీ చేశారు.

భిన్నాభిప్రాయాలతో అవాంతరాలు

ఇలా మంజూరీ అయిన జిల్లా ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి 2025 జనవరి మాసంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కోర్టుల నిర్మాణాలకు ఒకేసారి శంకుస్థాపన కార్యక్రమాన్ని చేయనున్నారు. కానీ, గద్వాల బార్ అసోసియేషన్‌లో న్యాయవాదుల మధ్య భిన్నభిప్రాయాలు ఏర్పడడంతో నిర్మాణంపై సందిగ్ధత నెలకొంది. గద్వాల బార్‌అసోసియేషన్‌లో సుమారు 180మంది సభ్యులుగా ఉన్న న్యాయవాదులు రెండు వర్గాలుగా విడిపోయారు. గతంలో కేటాయించిన స్థలం గద్వాల జిల్లా కేంద్రానికి దూరంగా ఉండడమే కాకుండా రాకపోకలకు సైతం అడ్డంకులు తలెత్తుతాయని.. ప్రస్తుతం పీజేపీ క్యాంపు ఆవరణలోనే మిగిలి ఉన్న స్థలం కేటాయించి అక్కడే నూతన ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో స్థలం కేటాయింపు, నిధుల మంజూరీ జరగడంతో అక్కడే నిర్మాణాలు చేపట్టాలని డిమాండు చేస్తున్నారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం కూడా చోటుచేసుకోవడమే కాకుండా, పరస్పర భౌతికదాడుల వరకు వెళ్లినట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు చొరవ చూపెట్టి న్యాయవాదుల్లో ఏకాభిప్రాయం తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందనేది ప్రజల అభిప్రాయం.

క్రీడా స్ఫూర్తితో ఉన్నత శిఖరాలు



వాలీబాల్ సర్వీస్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ సంతోష్, చిత్రంలో ఎస్పీ శ్రీనివాస్

- కలెక్టర్ సంతోష్
- ఘనంగా సీఎం కప్ పోటీలు ప్రారంభం

గద్వాలటౌన్: ప్రతి క్రీడాకారుడికి క్రీడాస్ఫూర్తి ముఖ్యమని, దీని వల్లే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని కలెక్టర్ సంతోష్ పేర్కొన్నారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో సీఎం కప్ క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలలో భాగంగా మొదటి రోజు సోమవారం కబడ్డీ, వాలీబాల్ జిల్లాస్థాయి పోటీలను ఎస్పీ శ్రీనివాస్‌తో కలిసి కలెక్టర్ సంతోష్ ప్రారంభించారు. అనంతరం వారు క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు జాతీయస్థాయి పోటీలను లక్ష్యంగా నిర్దేశించుకొని ఆడాలని సూచించారు. ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని సూచించారు. చదువుతోపాటు క్రీడలలోనూ రాణించాలని సూచించారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వంతోపాటు, మానసిక దృఢత్వం లభిస్తుందని చెప్పారు. అనంతరం కలెక్టర్ సంతోష్ వాలీబాల్ సర్వీస్ చేసి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ రగ్బీ పోటీలకు ఎంపికైన ధరూర్ జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన క్రీడాకారులు తిరుమలేష్, ఉరుకుందమ్మ, చింటూలాను జిల్లా కలెక్ట, ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జడ్పీసీఈఓ కాంతమ్మ, డీవైఎస్‌ఓ బీఎస్ ఆనంద్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

'పాల ఉట్ల'కు పోటెత్తారు..



వివరాలు 8లో ▸

మక్తల్‌లోని పడమటి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం నిర్వహించిన పాల ఉట్లు కొట్టే కార్యక్రమానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి ఆలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పాల ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించగా.. యువకులు పైకి ఎగబాకుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. అంతకుముందు చిన్నారులు దాండియా నృత్యాలు.. భక్తుల అడుగుల భజనల నడుమ పల్లకీసేవ సాగింది. ఉత్సవాలకు నాలుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరాగా.. ఆలయ పరిసరాలు హనుమాన్ నామస్మరణతో మార్మోగాయి. – మక్తల్

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్–2 పరీక్ష



గద్వాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ శ్రీనివాస్

- రెండో రోజు 52 శాతం గైర్హాజరు
- 8,722 మంది అభ్యర్థులకు 4,191 మంది అభ్యర్థులు హాజరు

గద్వాలటౌన్: టీజీపీఎస్సీ గ్రూప్–2 పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. రెండో రోజు సోమవారం జిల్లా పరిధిలో ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 25 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు మధ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకొని అభ్యర్థులను హాల్‌లోకి అనుమతించారు. అయితే అభ్యర్థుల హాజరు కంటే గైర్హాజరే ఎక్కువగా ఉంది. ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు జరిగిన పేపర్–3 పరీక్ష, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్–4 కొనసాగింది. మొత్తం 8,722 మంది అభ్యర్థులకు గాను 4,191 మంది అభ్యర్థులు (48.06 శాతం) హాజరయ్యారు. 4,531 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. సుమారు 52 శాతం మంది అభ్యర్థులు రెండవ రోజు గైర్హాజరు కావడం విశేషం. జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను ఎస్పీ శ్రీనివాస్ తనిఖీ చేశారు. నిర్ణీత సమయానికి నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాయడానికి అభ్యర్థులను లోపలికి అనుమతించడానికి వీలు లేదని అధికారులు ఆయా పరీక్షా కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. అయితే అభ్యర్థులు ముందస్తుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవడంతో నిర్ణీత సమయంలోనే పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 8గంటల నుంచే పట్టణంలో గ్రూప్–2 పరీక్ష రాయడానికి వచ్చిన అభ్యర్థులతో సందడి నెలకొంది. పరీక్ష రాయడానికి వచ్చిన చాలామంది అభ్యర్థులకు చంటిపిల్లలు ఉండటంతో వారికి సహాయకులుగా వారి కుటుంబ సభ్యులు పరీక్షా కేంద్రాలకు వచ్చారు. పిల్లలను ఆడించుకుంటూ కనిపించారు. పరీక్షా కేంద్రాల ఆరుబయట అభ్యర్థుల సహాయకులు సైతం పెద్ద సంఖ్యలో కనిపించారు. గ్రూప్–2 రాత పరీక్ష రెండవ రోజు ప్రశాంతంగా ముగిసిందని అధికారులు తెలిపారు.

ఎర్రవల్లిలో..

ఎర్రవల్లి: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన గ్రూప్–2 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. సాయిధ చైతన్య పాఠశాలలో 456 మంది అభ్యర్థులకు గాను 236, సరస్వతి ఏసి క్యాంపస్‌లో 432కు గాను 221, సరస్వతి మెయిన్ క్యాంపస్‌లో 432కు గాను 222 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల ఇంచార్జులు తెలిపారు. మూడు పరీక్ష కేంద్రాలకు గాను 1320మంది అభ్యర్థులను కేటాయించగా 679 మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. 641మంది గైర్హాజరయ్యారు. ఆయా పరీక్ష కేంద్రాలను ప్రత్యేక అధికారులు తనిఖీ చేయగా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



గద్వాలలోని పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



ఎర్రవల్లిలో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న అభ్యర్థులు

కేఎల్ఐపై ఫోకస్..

2025 డిసెంబర్‌లోగా పూర్తిస్థాయి నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు

- 4.50 లక్షల ఎకరాలకు నీరందించేలా ప్రణాళిక
- పెండింగ్ పనుల పూర్తిపై ప్రత్యేక దృష్టి
- 'పాలమూరు' ఎత్తిపోతలపై వీడని సందిగ్ధం
- ఇంకా అసంపూర్తిగానే టన్నెళ్ల నిర్మాణం, మోటార్ల బిగింపు పనులు



నాగర్‌కర్నూల్ మండలం కుమ్మెర సమీపంలో కేఎల్ఐ కాల్వ

సాక్షి, నాగర్‌కర్నూల్: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పూర్తిస్థాయిలో నిర్మించి, ఆయకట్టు రైతులందరికీ సాగునీరు అందించడంపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న కేఎల్ఐ ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేయాలని భావిస్తోంది. మొత్తానికి 2025 డిసెంబర్ నాటికి కేఎల్ఐ పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాల పెండింగ్ పనులను వీలైనంత త్వరగా పూర్తిచేసి.. పూరిస్థాయిలో ఆయకట్టుకు నీరందించేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. అయితే కీలకమైన పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తిచేయడంపై మాత్రం ఆచితూచి అడుగులు వేస్తున్నట్టుగా తెలిసింది. ఈ ప్రాజెక్టు పూర్తిచేసేందుకు భారీ స్థాయిలో వ్యయం కానుండటంతో, ముందుగా చిన్న ప్రాజెక్టులను పూర్తిచేసేందుకే ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది.

4.50 లక్షల ఎకరాల సామర్థ్యానికి కేఎల్ఐ..

ఉమ్మడి జిల్లాలోని కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, జడ్చర్ల, వనపర్తి నియోజకవర్గాల్లోని సుమారు 4.50 లక్షల ఎకరాల వరకు నీరందించేందుకు చేపట్టిన కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఏళ్లుగా పూర్తిస్థాయి నిర్మాణానికి నోచుకోక సగం ఆయకట్టుకే పరిమితమైంది. ప్రస్తుతం 3.07 లక్షల ఎకరాలకు నీరందిస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ.. డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మించని కారణంగా లక్ష్యం నెరవేరడం లేదు. ప్రస్తుతం ఎల్లూరు, జొన్నలబొగడ, గుడిపల్లి రిజర్వాయర్లలో నీటిని నింపి.. వాటి పరిధిలోని చెరువులు, కుంటలకు నీరందిస్తున్నారు. మూడు ప్యాకేజీల కింద చేపట్టిన ప్రాజెక్టు పనులు అసంపూర్తిగా ఉండటంతో చివరి ఆయకట్టు రైతులకు నీరందడం లేదు. కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల పరిధిలో చేపట్టిన డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌కు సైతం పూర్తిస్థాయిలో లైనింగ్ నిర్వహించక, కొన్నేళ్లుగా నిర్వహణ లేక ఆయకట్టు రైతులకు సరిపడా నీరు అందడం లేదు.

విస్తరణ పనులతో మేలు..

కేఎల్ఐ 28వ ప్యాకేజీలో విస్తరణ పనులతో పాటు 29, 30 ప్యాకేజీలను పూర్తిచేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. 29వ ప్యాకేజీలోనూ డీ–82 కెనాల్ విస్తరణతో సుమారు 37 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. అచ్చంపేట బ్రాంచ్ కెనాల్ విస్తరణ ద్వారా ఉప్పునుంతల మండలం వరకు 15వేల ఎకరాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోనున్నారు. తర్వాతి దశలో 30వ ప్యాకేజీ విస్తరణలో భాగంగా కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడ్గుల్ మండలం వరకు ఆయకట్టు విస్తరించేలా డిస్ట్రిబ్యూటరీలు, కాల్వలను నిర్మించనున్నారు. కేఎల్ఐ కింద చేపట్టిన 28వ ప్యాకేజీ పరిధిలో 84 కి.మీ., 29వ ప్యాకేజీలో 160 కి.మీ., 30వ ప్యాకేజీ కింద మరో 80 కి.మీ. మేర కాల్వలను తవ్వాల్సి ఉంది. ఈ మేరకు భూసేకరణ పనులతో పాటు పునరావాస ప్రక్రియ వేగంగా పూర్తి చేసి.. 2025 నాటికి ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

పెండింగ్‌లోనే 'పాలమూరు'..

ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని సుమారు 12.5 లక్షల ఎకరాలకు నీరందించేలా పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటికే నార్లాపూర్, ఏదుల, వట్టెం రిజర్వాయర్లు పూర్తికాగా.. పంప్‌హౌజ్‌లు, మోటార్ల బిగింపు టన్నెళ్లు, కాల్వల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. పాలమూరు ఎత్తిపోతల కింద చేపట్టిన పనులను మొదట కర్వెన, ఆ తర్వాత ఉద్దండాపూర్ వరకు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల అధికారులను ఆదేశించారు. అయితే ఇందుకు అవసరమైన నిధుల కేటాయింపుపై నిర్ణయం తీసుకోలేదు. దీంతో పనుల పురోగతిపై అనుమానాలు నెలకొన్నాయి. పాలమూరు ఎత్తిపోతల కింద కర్వెన రిజర్వాయర్ వరకు నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేయాలని భావిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.



నార్లాపూర్ వద్ద పెండింగ్‌లో ఉన్న పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు

రెండేళ్లలో పూర్తి చేసేలా కార్యాచరణ..

కేఎల్ఐ కింద 28, 29, 30 ప్యాకేజీలను పూర్తిస్థాయిలో నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. మొత్తం 4.50 లక్షల ఎకరాలకు నీరందించేలా పనులు నిర్వహిస్తాం. పాలమూరు ఎత్తిపోతల కింద కర్వెనతో పాటు ఉద్దండాపూర్ వరకు పనులు పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వేగంగా పనులు పూర్తయ్యేలా చర్య లు తీసుకుంటాం.

– విజయ్‌భాస్కర్‌రెడ్డి, సీఈ, నీటిపారుదలశాఖ

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డుపై విద్యుత్ స్తంభానికి ఉన్న విద్యుత్ వైర్లు తగిలి ఓ వ్యక్తి మృతిచెందాడు. వన్‌టౌన్ ఎస్ఐ శీనయ్య కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని హబీబ్‌నగర్‌కు చెందిన ఎండీ జహంగీర్ పాష(44) సోమవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో మార్కెట్‌లో కూరగాయలు తీసుకుని.. అలీస్ మార్ట్ దుకాణంలో నిత్యావసర సామగ్రి తీసుకోవడానికి ద్విచక్రవాహనం నిలిపి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభం దగ్గర వైర్లకు తగిలి కిందపడిపోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై జహంగీర్‌పాష సోదరుడు రహీంపాష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లిదండ్రులు మందలించడంతో

- యువకుడి బలవన్మరణం


నితీష్‌కుమార్ (ఫైల్)

ఆత్మకూర్: తల్లిదండ్రులు మందలించడంతో యువకుడు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేందర్ తెలిపిన వివరాలు ప్రకారం.. ఆత్మకూర్‌లో నివాసముంటున్న కాసోజు రవికుమార్, సునీత దంపతుల రెండో కుమారుడు నితీష్‌కుమార్ పదో తరగతి వరకు చదివి మూడేళ్లుగా బెంగళూరులో గ్లాస్‌వర్క్ చేసుకుంటున్నాడు. మూడు నెలల క్రితం ఆత్మకూర్‌కు వచ్చిన నితీష్ జులాయిగా తిరుగుతుండడంతో.. ఏదైనా పనిచేసుకోవాలని లేదా బెంగళూరుకు వెళ్లాలని తల్లిదండ్రులు మందలించారు. ఆదివారం గురుపౌర్ణమి ఉండడంతో కుటుంబ సభ్యులందరూ మక్తల్‌లోని దత్తాత్రేయ ఆలయానికి వెళ్లారు. ఒంటరిగా ఉన్న నితీష్ ఇంట్లోని దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం 9 గంటలకు ఇంటికి తిరిగి రాగా.. నితీష్ ఎంతసేపటికి తలుపులు తెరువకపోవడంతో వాటిని బద్దలుకొట్టి లోపలికి వెళ్లి చూడగా నితీష్ దూలానికి వేలాడుతు కనిపించాడు. స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లడంతో అప్పటికే నితీష్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యా యత్నం చేసిన సరిత

జడ్చర్ల: రైలు కింద పడి మహిళ ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల, ప్రత్యక్ష సాక్షుల ప్రకారం బాదేపల్లి పాతబజార్‌కు చెందిన సరిత ఉదయం 10.30 గంటల ప్రాంతంలో సిగ్నల్‌గడ్డ బ్రిడ్జి దగ్గర రైలు పట్టాలపైకి చేరుకుంది. జడ్చర్ల రైల్వే స్టేషన్ నుంచి కాచిగూడ వెళ్తున్న రైలుకు సిగ్నల్‌గడ్డ వద్ద పట్టాలపై మహిళ అడ్డుగా రావడంతో లోకోపైలెట్ గమనించి రైలును నిలిపివేశాడు. మహిళకు అంగుళం దూరంలో రైలు నిలిచిపోవడంతో త్రుటిలో ప్రాణాపాయం తప్పడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. చుట్టుపక్కల వారు వచ్చి మహిళతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మహిళ భర్త కృష్ణ వేధింపుల భరించలేక ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు పేర్కొంది. అనంతరం తెలిసిన బంధువుల ఆ టోలో బాధిత మహిళను ఇంటికి తీసుకెళ్లారు.

భార్యపై భర్త దాడి.. కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం : భార్యపై భర్త దాడి చేసిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని నాగనూలు గ్రామంలో చోటు చేసుకున్నట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు.. నాగనూలు గ్రామానికి చెందిన నితిన్ అతని భార్య చంద్రకళపై ఈనెల 15న మద్యం మత్తులో దాడి చేశాడు. దాడిలో చంద్రకళకు గాయాలయ్యాయి. చంద్రకళ సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

లక్ష్మీనగర్‌కాలనీలో దొంగ హల్‌చల్

- స్కూటీ ఎత్తుకెళ్లి ముళ్లపొదల్లో వదిలేసిన వైనం

మహబూబ్‌నగర్ క్రైం: పట్టణంలోని లక్ష్మీనగర్ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి ఓ దొంగ హల్‌చల్ చేశాడు. ఓ ఇంటి ముందు పార్క్ చేసిన స్కూటీని తాళం పగలగొట్టి కొంత దూరం తీసుకెళ్లి ముళ్లపొదల్లో వదిలేశాడు. అంతకుముందు దొంగ కొన్ని ఇళ్లలోకి వెళ్లేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. దొంగతనం కోసం ప్రయత్నిస్తున్న దృశ్యాలు ఆ కాలనీలో ఓఇంటికి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. ఈ ఏరియాలో ఇటీవలే ఐదుగురు యువకులు బెడ్డీలపై తిరుగుతూ హల్‌చల్ చేశారు. నిత్యం ఇలాంటి ఘటనలు జరుగుతున్న పోలీసులు దృష్టి సారించడం లేదని స్థానికులు వాపోతున్నారు.

వైభవంగా అంజన్న రథోత్సవం

- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- ఆంజనేయ నామస్మరణతో మార్మోగిన జాతర మైదానం


ప్రత్యేక అలంకారంలో అంజన్నస్వామి


దేవాలయం వద్ద స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

దేవరకద్ర: మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రసిద్ధి చెందిన చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి రథోత్సవం సోమవారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా సాగింది. అంజన్న నామస్మరణతో జాతర మైదానం మార్మోగిపోయింది. కన్నులు మిరుమిట్లు గొలిపేలా బాణసంచాను కాల్చారు. భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. పలువురు మహిళలు పూనకాలతో ఊగిపోయారు. జాతరకు వివిధ ప్రాంతాలనుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు దీరారు. పలువురు భక్తులు దాసంగాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. గండజ్యోతులతో, పార్లు దండాలతో ఇంటి దేవుడిని కొలిచారు. పలువురు కోడేలను, ఆవులను ఆలయానికి అందజేశారు.

జోరుగా వ్యాపారాలు..

జాతరలో వ్యాపారాలు జోరుగా సాగాయి. జిలేబీలు, ఇతర స్వీట్లను భక్తులు పెద్దఎత్తున కొనుగోలు చేశారు. గాజుల, బొమ్మల దుకాణాలు కిటకిటలాడాయి. చిన్నారులకు సంబంధించిన రంగుల జాయింట్ వీల్, ట్రైన్, ఇంకా పలు ఆటలకు సంబంధించిన ఏర్పాటుచేశారు. జాతర ఉత్సవాలు రెండు వారాల పాటు కొనసాగుతాయి.


గజవాహనంపై ఊరేగుతున్న ఆంజనేయస్వామి

భక్తిశ్రద్ధలతో ఆరుద్రోత్సవం

- కపిలగోవుకు ప్రత్యేకపూజలు
- భక్తులతో పోటెత్తిన అలంపూర్ క్షేత్రం


అన్నాభిషేకంలో బ్రహ్మేశ్వర స్వామి


శ్రీజోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివార్ల పల్లకీ సేవలో భక్తులు

అలంపూర్ : శ్రీజోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం ఆరుద్రోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మార్గశిర మాసం అందులో సోమవారం రోజు ఆరుద్ర నక్షత్రం కలిసిరావడంతో ఈ ఆరుద్రోత్సవానికి ప్రత్యేకత సంతరించుకుందని ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ముందుగా కపిల గోవుకు ప్రత్యేక పూజలు చేశారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలతో ఆలయ ప్రాకార ప్రదక్షిణలు, దర్బార్ సేవలు జరిగాయి. ఆలయంలోని రససిద్ధి గణపతికి అభిషేకాలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అలంకరణలు చేశారు. భక్తులతో వేదపండితులు పారాయణాలు చదివించారు.

రథోత్సవం

శ్రీజోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై కొలువుదీర్చి సేవలు నిర్వహించారు. ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ గుమ్మడికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు హరహర మహాదేవా.. శంభోశంకర అంటూ ఆలయం చుట్టూ రథాన్ని లాగారు. దర్బార్ సేవలు, మహామంత్ర పుష్పాలతో ఆలయ ప్రాంగణాలు ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి.

బ్రహ్మేశ్వరుడికి ఏకాదశ రుద్రాభిషేకాలు

గర్భాలయంలో కొలువుదీరిన బాలబ్రహ్మేశ్వరుడికి భక్తులు 11పర్యాయాలు ఏకాదశ రుద్రాభిషేకాలను నిర్వహించారు. ఓం నమఃశివాయ అంటూ భక్తులు మహాశివ పంచాక్షరిని స్మరిస్తూ అభిషేకాలు చేస్తుండగా వేదపండితులు రుద్ర నామక చమకాలను వల్లవేశారు. వివిధ రకాల పండ్ల రసాలు, పంచామృతాలు, మంగళద్రవ్యాలతో అభిషేకించారు. అన్న సూక్త పఠనంతో స్వామివారికి శ్వేతాన్నంతో అభిషేకాలు జరిగాయి. అన్నాన్ని లింగాకృతిలో అలంకరించి బిల్వాదళాలు, వివిధ రకాల పూలతో అష్టోత్తర అర్చనలు చేశారు. పంచభక్ష పరమాన్నాలతో మహా నైవేద్యాలు చేశారు. ఏక, నేత్ర, బిల్వ, వేద, కర్పూర, పంచక, రథ, చక్ర, కుంభ, నక్షత్ర హారతులను శివిధ నీరాజనాలు సమర్పించారు. ఆరుద్రోత్సవాన్ని వీక్షించడానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఆరుద్రోత్సవ విశిష్టతను ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ భక్తులకు వివరించారు. తీర్థప్రసాదాలను అందజేశారు. బ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

నేరస్తులపై నిఘా ఉంచాలి

- రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి
- మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ

జడ్చర్ల టౌన్: పోలీస్ స్టేషన్‌లో అధిక కేసులు నమోదవుతున్నందున ఆస్తి సంబంధిత నేరాలు, వ్యక్తిగత దాడులు చేసిన నేరస్తులపై హిస్టరీ షీట్స్ తెరిచి వారిపై నిఘా ఉంచాలని మల్టీజోన్- 2 ఐజీ సత్యనారాయణ అన్నారు. సోమవారం సాయంత్రం జడ్చర్ల పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ.. నేరస్తులపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. జడ్చర్ల మీదుగా 44, 167 జాతీయ రహదారులు వెళ్తున్నందున ప్రమాదాల నివారణకు తగుచర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలుచేయాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది వ్యాయామం, యోగ, ధ్యానం, వాకింగ్ చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు, విధుల గురించి సీఐ ఆదిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఐజీతో పాటు జిల్లా ఎస్పీ జానకి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఐజీ సత్యనారాయణ

అండర్-14 టోర్నీలో జిల్లా జట్టు శుభారంభం


విజయం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టుతో కోచ్‌లు

- 445 పరుగుల భారీ తేడాతో ఎస్‌టీ ఆంథోనిస్ జట్టుపై విజయం
- డబుల్ సెంచరీ సాధించిన కేతన్‌కుమార్

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో సోమవారం నుంచి ప్రారంభమైన హెచ్‌సీఏ అండర్-14 బాలుర స్కూల్ టోర్నమెంట్‌లో ఉమ్మడి జిల్లా జట్టు శుభారంభం చేసింది. వన్ చాంపియన్-2 గ్రౌండ్‌లో సోమవారం ఎస్‌టీ ఆంథోనీస్ హైస్కూల్- హిమాయత్‌నగర్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో జిల్లా జట్టు 445 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన జిల్లా జట్టు 47 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 468 పరుగుల భారీ స్కోర్ చేసింది. జట్టులో మొదటి డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన జి.కేతన్‌కుమార్ డబుల్ సెంచరీతో రాణించాడు. 136 బంతుల్లో 26 ఫోర్లు, 1 సిక్స్‌తో 235 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇతర బ్యాట్స్‌మెన్లు శ్రీహర్షిత్ (75 నాటౌట్), ఎ.హర్షిత్ 62 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌టీ ఆంథోనీస్ జట్టు మహబూబ్‌నగర్ జిల్లా బౌలర్ల ధాటికి వరుసగా వికెట్లను కోల్పోయింది. 11.1 ఓవర్లలో 23 పరుగులకు ఆలౌట్ అయింది. జిల్లా బౌలర్ సోహైల్ 5.1 ఓవర్లలో 7 పరుగులు ఇచ్చి 6 వికెట్లు, వెంకటసాగర్ 3 ఓవర్లలో 6 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీశారు.

ఎండీసీఏ అభినందనలు..

హెచ్‌సీఏ అండర్-14 స్కూల్ టోర్నీలో మొదటి మ్యాచ్‌ను ఉమ్మడి జిల్లా జట్టు గెలుపొందడంపై మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లా టోర్నీలో మొదటి మ్యాచ్‌ను గెలుపొంది శుభారంభం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న మ్యాచుల్లో విజయాలు సాధించి టోర్నీ విజేతగా నిలవాలని ఆకాంక్షించారు.


సోహైల్ (6 వికెట్లు)
కేతన్‌కుమార్ (235 పరుగులు నాటౌట్)

ఇసుక గుంతలో పడి వ్యక్తి మృతి

- ఇసుక మాఫియావల్లనే అంటున్న గ్రామస్తులు

రాజాపూర్: చేపలు పట్టేందుకు వెళ్లి ఇసుక గుంతలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు.. జడ్చర్ల మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన బాలస్వామి (30) అమ్మగారి గ్రామం రాజాపూర్ మండల కేంద్రానికి వచ్చి సోమవారం గ్రామ శివారులోని దుందుభి వాగులోని ఇసుక గుంతలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ నేపథ్యంలో అదే గుంతలో పడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. యువకుడు మృతి చెందిన విషయాన్ని కొందరు ఇసుక మాఫియా దృష్టికి తీసుకెళ్లగా వారు విషయం బయటికి పొక్కకుండ మృతదేహాన్ని బయటికి తీసి పోలేపల్లికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇసుక మాఫియా దుందుభి వాగులో కృత్రిమ ఇసుక తయారు చేసేందుకు ఏర్పాటు చేసిన గుంతల్లో పడి పలువురు మృతి చెందుతున్నట్లు ఈ వ్యవహారాన్ని గుట్టుచప్పుడు కాకుండా ముగిస్తున్నారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

వణికిస్తున్న చలి

జడ్చర్ల టౌన్: జిల్లాలో ప్రజలను చలి వణికిస్తుంది. తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు కనిష్ట ఉష్ణోగ్రత 10 డిగ్రీలకు పడిపోతుండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆది, సోమవారాల్లో ఉదయం కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువ నమోదు కాగా.. సాయంత్రం వేళకే ఇళ్లకు చేరుకుని చలి నుంచి రక్షించుకుంటున్నారు. అయితే వృద్ధులు, చిన్నారులు మాత్రం చలితో తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నారు.

కోలాహలంగా పాల ఉట్లు

- పోటెత్తిన జనం


శ్రీపడమటి ఆంజనేయస్వామి

మక్తల్: పడమటి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా పడమటి ఆంజనేయ ప్రాంగణంలో సోమవారం పాల ఉట్లు కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. పాల ఉట్లు సందర్భంగా భక్తులు కోలాటం, చిన్నారులు దాండీయ నృత్యాలు. ఆడుగుల భజనలు చేస్తూ ఊరేగింపుతో వెళ్లారు. ఈసారి భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. పాల ఉట్లు కార్యక్రమం పోటాపోటీగా సాగింది. మక్తల్‌కు చెందిన కొంతమంది యువకులు సహాయంతో ఒక యువకుడు పైకి ఎక్కి ఉట్టిని కొట్టాడు. పలువురు అతడిని అభినందించారు. సాయంత్రం పట్టణంలో పల్లకీసేవ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అధికంగా రావడంతో అంతర్రాష్ట్ర రహదారిపై ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైంది. సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి భక్తులు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు.

భక్తులతో పోటెత్తిన ఆదిశిలా క్షేత్రం


స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

మల్దకల్: ఆదిశిలాక్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు సోమవారం భక్తులు పోటెత్తారు. ఇదిలాఉండగా, ఆదివారం రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము వరకు నిర్వహించిన రథోత్సవం కనులపండువగా సాగగా.. భాజా భజంత్రీలు.. మేళతాళాలు.. భక్తుల గోవింద నామస్మరణలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఇక సోమవారం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం అంతా కిటకిటలాడింది. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి వారికి దాసంగాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నెలరోజులపాటు స్వామివారికి దాసంగాలు సమర్పించడం ఇక్కడ ఆనవాయితీ. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు క్యూలైన్లు ఏర్పాటు చేయగా.. వాటిలో భక్తులు బారులు తీరారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి, అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారి, ధీరేంద్రదాసు, చంద్రశేఖర్‌రావు, నాగరాజు శర్మ, బాబురావు, అరవిందరావు, వాల్మీకి పూజారులు తదితరులు పాల్గొన్నారు.


మల్దకల్ జాతరలో కిక్కిరిసిన భక్తులు



కొబ్బరికాయలో రెండు భాగాలు

దేవరకద్రలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి ఆలయంలో సోమవారం ఓ భక్తుడు కొబ్బరికాయ కొట్టగా అందులో రెండు భాగాలు వచ్చాయి. కొబ్బరి కాయల్లో ఎక్కువగా పువ్వు, మొగ్గ రూపంలో కనిపిస్తాయని, కానీ, ఒకే కొబ్బరికాయలో రెండు భాగాలు రావడం ఇదే మొదటిసారి అని ఆలయ పూజారి నాగరాజుస్వామి తెలిపారు. ధనుర్మాసం ప్రారంభంలోనే ఇలా కొబ్బరికాయ కనిపించడం శుభసూచకమని ఆయన పేర్కొన్నారు.

– దేవరకద్ర

పంప్‌మోడ్ పద్ధతిలో 8,798 క్యూసెక్కులు తరలింపు

దోమలపెంట: భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో 24 గంటల వ్యవధిలో శ్రీశైలం ఆనకట్ట దిగువన నాగార్జునసాగర్ జలాశయం నుంచి ఆనకట్ట ఎగువన శ్రీశైలం జలాశయంలోకి 8,798 క్యూసెక్కుల నీటిని (ఎత్తిపోతల) తరలించారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,631, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సోమవారం సాయంత్రం వరకు శ్రీశైలం జలాశయంలో 863.8 అడుగుల వద్ద 118.0544 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

18 క్వింటాళ్ల రేషన్ పట్టివేత


పట్టుబడిన రేషన్ బియ్యం

ఆత్మకూర్: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై నరేందర్ తెలిపారు. ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో ఎరుకలి నాగరాజు తన ఇంట్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచాడన్న సమాచారంతో ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. దాడిలో 18 క్వింటాళ్ల బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వేణుగోపాల్ బృందం పంచనామా నిర్వహించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పొలం విషయంలో ముగ్గురిపై దాడి

అడ్డాకుల: పొలం విషయంలో జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలైన ఘటన అడ్డాకుల మండలం కందూర్ శివారులో సోమవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. మూసాపేట మండలం నిజాలాపూర్ గ్రామానికి చెందిన శేరి సంజీవ సోదరి వ్యవసాయ పొలం కందూర్ శివారులో ఉంది. పొలం వద్ద పెద్దల సమక్షంలో పంచాయతీ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో సంజీవ, శివ, శ్రీనులపై అదే గ్రామానికి చెందిన కానిస్టేబుల్ రామలింగం, రాములు, జయంతి, శ్రీనుతో పాటు మరొకరు దాడి చేసినట్లు బాధితులు తెలిపారు. దాడిలో సంజీవకు తీవ్రగాయమైంది. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం మహబూబ్‌నగర్‌లోని ఆస్పత్రి చికిత్స పొందుతున్నాడు. దాడి విషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.